క్లుప్తంగా

నేడు రాయికోడ్‌లో విగ్రహాల ఆవిష్కరణ

నర్వ: రాయికోడ్‌లో మంగళవారం సావిత్రి బాయిపూలే, జ్యోతిబాపూలే విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, యువకులు, యువజన సంఘాల నాయకులు, ఆయా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు.

నర్వకు రానున్న కలెక్టర్

నర్వ: తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సమస్యలు, ధరణిపోర్టల్ వల్ల కలిగిన సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టర్ కోయశ్రీహర్ష నర్వకు రానున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు కార్యాలయంలో సమీక్షిస్తారన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పల్లెప్రగతి, ఉపాధి పనులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

బహిరంగ సభ పోస్టర్ విడుదల

మక్తల్: అంబేడ్కర్ జాతర సందర్భంగా ఈ నెల 29 న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం అంబేడ్కర్ సంఘం నాయకులు మక్తల్ మార్కెట్ యార్డులో పోస్టర్లు విడుదల చేశారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కర్రెం అంజి, హన్మంతు, అంజి, రఘు, తాయప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞాన సదస్సు

నారాయణపేట రూరల్ : స్థానిక సత్యనారాయణస్వామి దేవాలయంలో సోమవారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అక్షిత ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మణివర్ధన్‌రెడ్డి, అక్షితలు ముఖ్య అతిథులుగా హాజరై ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. వివిధ రోగాలకు సంబంధించి నివారణ విషయాలను తెలియచేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు చెప్పాలన్నారు. చింతలయ్య, గోపాల్, వెంకట్రాములు, ఖాసీం పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

దామరగిద్ద: విద్యార్థులకు ఈ నెల 12 నుంచి నిర్వహించనున్న వార్షిక పరీక్షల నేపథ్యంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎంఈఓ వెంకటయ్య సోమవారం ఆదేశించారు. మండల వనరుల కేంద్రం నుంచి పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను తీసుకువెళ్లాలన్నారు. ఎప్పటి కప్పుడు పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేసి ఆన్‌లైన్‌లో పరీక్ష ఫలితాలను నమోదుచేయాలని సూచించారు.

ఊట్కూరు: ఎంఈఓ వెంకటయ్య ఈ నెల 12 నుంచి పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షిక పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని కోరారు.

'కానూరి' ఆశయాలు కొనసాగిద్దాం

నారాయణపేట రూరల్ : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు కానూరి వెంకట్రావు ఆశయాలను కొనసాగిద్దామని ఆ సంఘం జిల్లా కోశాధికారి అంజి అన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన 8వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. కళలు, సాహిత్యం, సంస్కృతిని కాపాడటం కోసం అహర్నిషలు కష్టపడి ప్రజల్లోకి తీసుకుని వెళ్లడంలో కానూరి సఫలీకృతుడయ్యాడని అన్నారు. కార్యక్రమంలో నర్సింహా, కాశీనాథ్, సలీం, సాధిక్, లక్ష్మి పాల్గొన్నారు.

ఆముదాలు క్వింటాల్ రూ. 5,777

నారాయణపేట: జిల్లాలో ఆముదాలు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.5,777, పెసర గరిష్ఠంగా రూ. 8,649, కనిష్ఠంగా 8,469, వేరుశనగ గరిష్ఠంగా రూ.5,829, కనిష్ఠంగా రూ.4,050, జొన్నలు గరిష్ఠంగా రూ.5,122, కనిష్ఠంగా రూ.4,852, ఆలసందలు గరిష్ఠంగా రూ.6,519, కనిష్ఠంగా రూ.4,742, వడ్లు హంస గరిష్ఠ, కనిష్ఠంగా రూ.1,830, వడ్లు సోనా గరిష్ఠంగా రూ.2,063, కనిష్ఠంగా రూ. 2,009, తెల్లకుసుమలు గరిష్ఠంగా, కనిష్ఠంగా రూ. 4,113 పలికాయి. పత్తి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 8 వేలు, కనిష్ఠంగా రూ. 4,500 పలికింది.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

కోస్గి: ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ పని చేస్తోందని కోస్గి బస్ డిపో ఇన్‌చార్జ్ కేవీ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక బస్టాండ్‌లో వేసవి కాలం దృష్ట్యా ప్రయాణికుల కోసం తాగునీటి సౌకర్యం కల్పిస్తూ నీటి కూలర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. బస్టాండ్ ఇన్‌చార్జ్ వెంకటేష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో కల్వర్టులు



పగిడిమర్రి శివారులో గుంతల మయంగా కల్వర్టు



అమీన్‌పూర్ శివారులో మరమ్మతుకు నోచుకోని కల్వర్టు

- మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఊట్కూర్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల్లో ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. దశాబ్దాల కాలం నాటివి కావడంతో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోవడం లేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. అధికవర్షాలతో కల్వర్టులపై వరదనీరు పారడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. కల్వర్టులపై గుంతలు, పగుళ్లు ఏర్పడడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణిస్తున్నారు. కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గతేడాది వర్షాకాలంలో ఊట్కూర్ పెద్ద చెరువు అలుగుపారడంతో శివారులోని బ్రిడ్జిపై వరద నీరు పారింది. ఊట్కూర్–నారాయణపేటకు రాకపోకలు నిలిచాయి. అధికారులు నామమాత్రంగా మరమ్మతు చేసి మమ అనిపించారు. పులిమామిడి గ్రామ శివారులోని చెరువు సమీపంలో కల్వర్టు పరిస్థితి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. అవుసలోనిపల్లి, అమీన్‌పూర్, మల్లెపల్లి, బిజ్వార్ తదితర గ్రామాల సమీపంలోని కల్వర్టుల పరిస్థితీ దారుణంగా ఉంది. ప్రయాణికులు ఈ దారుల్లో వెళ్లడానికి జంకుతున్నారు. మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు. విషయమై ఏఈ జగత్‌చంద్రను సంప్రదించగా కల్వర్టుల మరమ్మతు విషయంపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

మాగనూర్: మండలంలోని వర్కూర్ గ్రామ సమీపంలోని పెద్దవాగు నుంచి ప్రభుత్వ అనుమతులతో ఇసుక తరలిస్తుండగా సోమవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. నిత్యం గ్రామంలో ఇళ్ల మధ్యలో నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతుండటంతో వాటి ద్వారా వచ్చే దుమ్ము ఇళ్లలోపలికి వచ్చి వస్తువులపై పడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా అన్నం కూడా తినలేని దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. కొన్ని రోజుల నుంచి అడుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మైనింగ్ ఆర్ఐ రమేష్ ను వివరణ కోరగా.. తాము ఇసుక రీచ్ మొదలు పెట్టే సమయంలోనే వారికి ఈ విషయంపై గురించి చెప్పామన్నారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలగకుండా ఇసుక తరలింపు చేపట్టాలన్నారు.

15న కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

నారాయణపేట: గ్రామ పంచాయతీ అకౌంట్‌ను ఫ్రీజింగ్ చేయడంతో బిల్లులు నిలిచిపోయాయని, వెంటనే ఫ్రీజింగ్ తొలగించకపోతే ఈనెల 15న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తాయమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది నెలలుగా గ్రామ పంచాయతీ అకౌంట్‌లు ఫ్రీజింగ్ చేయడంతో బిల్లులు రాక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతూ అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి బిల్లులు చెల్లించకపోతే కలెక్టరేట్ ముట్టడి తప్పదన్నారు. ఈసమావేశంలో ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సి.ప్రకాశ్‌రెడ్డి, సర్పంచ్‌లు సాయిరెడ్డి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

కోస్గి: గతంలో ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అమలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. వెంటనే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రైతులు నాలుగు ఏళ్లుగా రైతులు ఎదురు చూస్తున్నారని, బ్యాంకు అధికారులు వారిపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇటీవలి అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్‌కుమార్, నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' మంజూరులో నిర్లక్ష్యం తగదు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు వెంటనే చెక్కులు మంజూరు చేసి, అందివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి నర్సింహులు, పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ మాట్లాడారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ అందించడం లేదని, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని ఆరోపించారు. అధికారులు చుట్టూ తిప్పుకుంటున్నారని, ఆఫీస్‌లో ఆపరేటర్లు లేరని, కంప్యూటర్లు పనిచేయడం లేదని సమాధానం ఇస్తున్నారు. నిరుపేదలైన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. అంతకుముందు తహసీల్దార్ దానయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజి, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా, సీపీఐ ఎంఎల్ పట్టణ నాయకులు సాధిక్, సలీం, సతీష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



పూజల్లో పాల్గొన్న సర్పంచ్, తదితరులు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట శివారులో కట్ట ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని దాతల సహకారంతో ఆలయం నిర్మాణం ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీ

మక్తల్: మండలంలోని కర్ని, పారేవుల, ముస్లాయిపల్లి, అనుగొండ తదితర గ్రామాల్లోని పాఠశాలలను జిల్లా ఏఎంఓ విద్యాసాగర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముస్లాయిపల్లిలో సమయానికి ముందే బడి వదలడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించాలని లేనిచో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కో ఆర్డినేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



ఊట్కూరులో బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ కె సత్యనారాయణ

నారాయణపేట రూరల్: టెన్త్ విద్యార్థులకు సోమవారం ఒకేరోజు ఫిజిక్స్, బయోసైన్స్ పేపర్లు అందించడం నిర్వాహకులకు కత్తిమీద సాములా మారింది. మొత్తానికి ఎలాంటి తప్పిదాలు లేకుండా ప్రశాంతంగా పరీక్ష పూర్తి చేశారు. ముందస్తుగా అన్ని కేంద్రాల సీఎస్, డీఓలు, ఇన్విజిలేటర్లకు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 38 పరీక్ష కేంద్రాల్లో 7,569కిగాను 31మంది గైర్హాజర్ కాగా 7,538 మంది, ప్రైవేటు కేంద్రంలో 16మందికి 13మంది హాజరయ్యారు. డీఈఓ లియాకత్‌అలీ తొమ్మిది, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరు, సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏడు కేంద్రాలు పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆరు కేంద్రాలను తనిఖీ చేశారు. ఇక భద్రత విషయంలో అడిషనల్ ఎస్పీ నాగేంద్రుడు పట్టణంలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించి పోలీసులకు సూచనలు చేశారు.

ఊట్కూర్: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని ఊట్కూరు, పులిమామిడి పరీక్ష కేంద్రాలను డీఎస్పీ కె సత్యనారాయణ సందర్శించారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



పరీక్షలు చేస్తున్న సిబ్బంది



కొల్పూర్‌లో..

నారాయణపేట టౌన్ : పట్టణంలోని 2వ వార్డులో కంటివెలుగు శిబిరాన్ని కౌన్సిలర్ జొన్నల అనిత ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగే శిబిరంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సోమవారం శిబిరంలో వైద్యులు మోనేష్ చారి స్థానికులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైనవారికి కంటి అద్దాలు, మందులు అందజేశారు. ఏఎన్‌ఎంలు సరస్వతి, శైలజ, ఆర్పీ ప్రమీల, వార్డు ఆఫీసర్ సంతోషి, ఆశా వర్కర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: కొల్పూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం శిబిరం నిర్వహణపై మట్లాడారు. ఇప్పటివరకు నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అనేక మంది లబ్ధిపొందారని. అందరూ పాల్గొని అంధత్వ నివారణలో భాగస్వాములు కావాలని కోరారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం చేపట్టాలి

నారాయణపేట టౌన్ : నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల సంబంధించిన జీఓ 69 అమలు చేయాలని జిల్లా జల సాధన సమితి కో–కన్వీనర్ హెచ్.నర్సింహ ఒక ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో జాతీయ నాయకులకు వినతిపత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 14 నుంచి జిల్లాలోని ఏడు మండల కేంద్రాలతో పాటు వికారాబాద్ జిల్లాలోని మూడు మండల కేంద్రాల్లో జాతీయ నాయకులకు ప్రతి నెల ఒక మండలానికి వెళ్లి వినతి పత్రాలు అందిస్తామని వివరించారు. రైతులు, రైతు కూలీలు జాతీయ నాయకులు వినతి పత్రాలు సమర్పించేందుకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సీపీఆర్‌పై అవగాహన

ధన్వాడ: సీపీఆర్, ఏఈడీపై సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆశాకార్యకర్తలకు మెడికల్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో కార్డియో పల్మనరీ పునరుజ్జీవన శిక్షణ కింద కార్యక్రమం ఏర్పాటు చేశారు. మెడికల్ అధికారి సాయి కుమార్ సీపీఆర్ చేసే విధానం వారికి వివరించారు. అనంతరం వారితో ప్రత్యక్షంగా చేయించారు. ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని సూచించారు. ఈ డాక్టర్ మునీర్‌హైమద్, సూపర్‌వైజర్ కతలప్ప తదితరులు ఉన్నారు.



నష్టపరిహారం అందించాలని ధర్నా

మక్తల్: భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన తమకు నష్టపరిహారం వెంటనే అందివ్వాలని బాధితులు మక్తల్ తహసీల్దార్ తిరుపతయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. 2020 నుంచి ఎన్నిసార్లు కలెక్టర్, ఆర్డీఓ, రెవిన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మార్కెట్ విలువ ప్రకారం తమకు నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, రామలింగం, ఉమాకాంత్, రతన్‌కుమార్, మైపాల్‌రెడ్డి, సీపీఎం కొండయ్య, అజయ్‌కుమార్ , కృష్ణమూర్తి , విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరడమ్మ జాతరకు ఏర్పాట్లు

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్‌లో వెలసిన ఊరడమ్మ మాత జాతర మంగళవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం ప్రత్యేక భజనలు చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారి చిత్రపటంతో పల్లకీ సేవ చేపట్టనున్నారు. అనంతరం జల్దిబిందే కార్యక్రమం ఉంటుందని నిర్వహకులు తెలిపారు. సాయంత్రం బోనాలు ఉంటాయన్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి రెనిపట్ల, పొలిచల్లడం, ట్రాక్టర్ రివర్స్ స్పీడ్ పోటీలు తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కృష్ణా: మండలంలోని హిందూపూర్ శివారులో మెయిన్ రోడ్డు నుంచి కస్తూర్బా పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి రోడ్డు ఉండడం వల్ల పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురయ్యేవారని, సీసీ నిర్మాణంతో సమస్య తీరనుందన్నారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.15లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేస్తుండడం అభినందనీయమని అన్నారు. ఎంపీపీ పూర్ణిమపాటిల్, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ సద్దాంహుసేన్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి నివాళి

మాగనూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సాలె ఈశ్వరయ్య(74) సోమవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి నివాళి అర్పించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. సర్పంచ్ రాజు, ఎంపీపీ శ్యామలమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గుప్త, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మక్తల్: రైతులు పండించిన పంటలను అడవి జంతువులు నాశనం చేస్తున్నాయని అధికారులు వాటికి రక్షణ కల్పించాలని మక్తల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కావలి వెంకటేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈవిషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, పటేల్‌రంగారెడ్డి, కాలేశ్వర్‌ప్రతాప్‌రెడ్డి, అనంతరెడ్డి, కుర్మయ్య, వెంకట్‌రెడ్డి, నర్సిములు, తిరుపతి, అశోక్‌రెడ్డి బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని నిరసన



దీక్షలో మాట్లాడుతున్న మనోహర్‌గౌడ్

నారాయణపేట రూరల్ : రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ పార్క్ వద్ద విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌గౌడ్, వామన్‌గారి సంతోష్‌కుమార్ మాట్లాడారు. సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, లేకపోతే పోరాటం చేస్తామని చెప్పారు. అనంతరం కలెక్టర్ శ్రీహర్షను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ మండలాల విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మాగనూర్: అపరిచిత వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాగనూర్ ఎస్ఐ నరేందర్ అన్నారు. సోమవారం మాగనూర్‌లోని బస్టాండ్ చౌరస్తాలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎవరైనా అపరిచిత వ్యక్తులు కాల్ చేసి లాటరీలో పేరు వచ్చింది, లోన్స్ ఇస్తాం అంటూ చెప్పే మాటలను నమ్మవద్దన్నారు. ఎవరితోనూ వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు పంచుకోవద్దన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఇలాంటి ఫోన్లు వచ్చినపుడు తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు పరిమిత వేగంతో వెళ్లాలని తప్పకుండా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణం వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి

కోస్గి: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణ పనులు సోమవారం ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి పరిశీలించారు. త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. నూతన భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు చేసే అంశాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్న వారికి కేసీఆర్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు అనుదీప్, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, పార్టీ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీను, కోఆప్షన్ సభ్యుడు గందె ఓంప్రకాష్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గిరివికాస్ నిధులు విడుదల చేయాలి

మద్దూరు: గిరి వికాస్ పథకానికి నిధులు విడుదల చేయించాలని స్థానిక ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని గిరిజన నాయకులు సంతోష్, దశరథ్‌లు కోరారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో గిరి వికాస్ కింద బోర్లు వేసుకున్నా ఇప్పటి వరకు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయలేదని అన్నారు. రెండేళ్లుగా ఈ పథకానికి నిధులు మంజూరు కాలేదని వెంటనే విడుదల చేయించాలని అన్నారు. అదేవిధంగా మండలంలోని లాల్యానాయక్ తండా నుంచి ఒంటిగుండు తండా వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు.

కౌన్సిలర్ పాడె మోసిన ఎమ్మెల్యే

కోస్గి: మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి(38) గుండెపోటు రావడంతో ఆదివారం రాత్రి మృతి చెందగా సోమవారం ఆమె అంత్యక్రియలు స్వగ్రామం మల్‌రెడ్డిపల్లిలో నిర్వహించారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా పాడె మోసారు. మొదటి సారి రాజకీయాల్లోకి వచ్చి కౌన్సిలర్‌గా విజయం సాధించిన లక్ష్మి మృతి పార్టీకి తీరని లోటన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమవారం స్థానిక ఏబీకే ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సభను నిర్వహించేందుకు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కానీ కౌన్సిలర్ లక్ష్మి మృతి చెందడంతో సభను రద్దు చేశారు. లక్ష్మి చిత్ర పటాన్ని ఉంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అక్కడే సంతాప సభను నిర్వహించారు.